HAPPY NEW YEAR 2024

నయా జోష్


భువనగిరిలోని పహాడీనగర్‌లో న్యూ ఇయర్ వేడుకల్లో కేరింతలు కొడుతున్న చిన్నారులు



- సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

# కొత్త ఆశయాలతో..

## 2024 సంవత్సరానికి స్వాగతం పలికిన జిల్లా ప్రజలు

## నూతన ఒరవడితో ముందుకు సాగుతామంటున్న ఉన్నతాధికారులు

కొత్త ఆశలు.. కొంగొత్త ఆశయాలతో జిల్లావాసులు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. పాత ఏడాది మిగిల్చిన జ్ఞాపకాలతో సరికొత్త లక్ష్యాలతో కొత్త వసంతంలోకి అడుగుపెట్టారు. డిసెంబర్ 31 రాత్రి 12 గంటలకు 2023కు వీడ్కోలు.. 2024కు స్వాగతం చెబుతూ ఆనంద డోలికల్లో తేలిపోయారు. అధికారులు సైతం వేడుకల్లో పాల్గొన్నారు. గత ఏడాది చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు, ఈ సంవత్సరం తమ లక్ష్యాలను 'సాక్షి'తో పంచుకున్నారు. – సాక్షి యాదాద్రి, దురాజ్‌పల్లి, నల్లగొండ

### విధి నిర్వహణకు ప్రాధాన్యం



విధి నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరవేడం లక్ష్యం. రెండు నెలల క్రితం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నేను.. అసెంబ్లీ ఎన్నికలను విజయవంతగా నిర్వహించాను. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, పోలీసు శాఖ, మీడియా, రాజకీయ పార్టీలు సహకరించాయి. 2024 సంవత్సరంలో లోక్‌సభ, స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను కూడా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా ముందుకెళ్తాం.

- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకు నావంతు ప్రయత్నం చేస్తాను. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడం నా ప్రధాన కర్తవ్యం.
- కొత్త సంవత్సరం ప్రజలందరూ సంతోషంగా ఉండాలి. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు.

–హనుమంతు కె.జెండగే, కలెక్టర్, యాదాద్రి భువనగిరి

### ప్రజలకు మరింత చేరువ అవుతాం



గడిచిన ఏడాది ఎన్నో సవాళ్లను అధిగమించాం. అనేక విజయాలు సాధించాం. నూతన సంవత్సరంలో ఇంకా బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు మరింత చేరువ కావాలన్నదే మా లక్ష్యం. నేరస్తులకు శిక్షలు పడి నేరప్రవృత్తికి దూరం అయ్యేలా కృషి చేస్తాం.

- ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఫిర్యాదు దారులకు ఫలితం కనిపించే విధంగా నూతన సంవత్సరంలో జిల్లా పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దుతాం. పోలీసు లంటే ప్రజల్లో భయం పోగొట్టి స్వేచ్ఛగా తమతో మమేకం అయ్యేలా చేస్తాం. లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్‌గా తీసుకొని ప్రశాంతమైన వాతావరణంలో, పారదర్శకంగా పూర్తి చేయాలన్నది పోలీసు శాఖ లక్ష్యం. కానిస్టేబుల్ నుంచి డీసీపీ వరకు జవాబుదారీ తనంతో నడుచుకునేలా కృషి చేస్తాం.
- 2023 సంవత్సరంలో విజయవంతంగా పనిచేశాం. జనవరిలో జిల్లాకు వచ్చాను.ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాం. గత ఏడాదితో పోలిస్తే నేరస్తులకు శిక్షలు అధికంగా పడే విధంగా చర్యలు తీసుకున్నాం. కానిస్టేబుల్ నుంచి డీసీపీ స్థాయి అధికారి వరకు విధి నిర్వహణలో పక్కాగా పని చేస్తున్నారు. నేరం చేసినవారు తప్పించుకోకుండా పక్కాగా నేర పరిశోధనకు ప్రయత్నిస్తాం.
- కొత్త సంవత్సరంలో యువత నూతన లక్ష్యాలతో ముందుకు సాగాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు. చెడు మార్గాల్లో పయనించి తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు. ప్రజలకు, పోలీసులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు.

– రాజేశ్‌చంద్ర, డీసీపీ, భువనగిరి జోన్

### ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుస్తాం



జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసేలా అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నాం. ఉద్యోగుల అటెండెన్స్, సెలవులు మానిటరింగ్ చేసేందుకు త్వరలోనే కొత్త యాప్‌ను పరిచయం చేయబోతున్నాం. ఈ యాప్‌ను రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిచే ప్రారంభింపజేస్తాం. మొదటి దశలో జిల్లాలోని అన్ని ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో పాటు జిల్లా అధికారుల కార్యాలయాల్లో అమలు చేస్తాం. ఆ తర్వాత గ్రామీణ స్థాయికి పరిచయం చేస్తాం. ప్రభుత్వం అమలు చేస్తున్న అభయ హస్తంలో ఆరు గ్యారంటీలను ప్రజలకు చేరవేయడమే మా ప్రధాన లక్ష్యం. కొత్త సంవత్సరంలో యంత్రాంగమంతా మరింత బాధ్యతగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలి.

– ఎస్.వెంకట్రావు, కలెక్టర్, సూర్యాపేట జిల్లా

### అర్హులందరికీ ఆరు గ్యారంటీలు



ఆరు గ్యారంటీలను అర్హులైన పేదలకు అందజేసేందుకు కృషి చేస్తాం. ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తోంది. ఆ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. కొత్త సంవత్సరంలో ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన వారికి చేరవేయడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తా..

– జె.శ్రీనివాస్,అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నల్లగొండ

### మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం



జిల్లాలో అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తాం. స్త్రీ శిశు మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు రకాల కార్యక్రమాలను చేపట్టి గర్భిణులు, పిల్లలకు పోషకాహారాలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీలు, గ్రామాల అభివృద్ధికి పాటు పడడంతోపాటు అన్నిచోట్ల పారిశుద్ధ్యాన్ని మెరుగు పరుస్తాం. – సీహెచ్.ప్రియాంక, అదనపు కలెక్టర్, సూర్యాపేట జిల్లా

### పథకాలు అమలు చేయడమే లక్ష్యం



ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను జిల్లాలో మారుమూల గ్రామ ప్రజలకు సైతం అందించే లక్ష్యంగా కొత్త సంవత్సరంలో అడుగులు వేస్తాం. జిల్లా అభివృద్ధికి అధికార యంత్రాంగం పాటు పడాలి. రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఆరు గ్యారంటీల అమలుకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాం జిల్లా అభివృద్ధికి ప్రజలు కూడా సహకారం అందించాలి.

– వెంకట్‌రెడ్డి, అదనపు కలెక్టర్, సూర్యాపేట జిల్లా

## నల్లగొండ ఎస్పీగా చందనాదీప్తి

నల్లగొండ క్రైం : జిల్లా ఎస్పీ అపూర్వ రావు బదిలీ అయ్యారు. ఆమెను ప్రభుత్వం సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ ఎస్పీగా నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. అపూర్వరావు 2023, జనవరి 26న నల్లగొండలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా నూతన ఎస్పీగా ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న చందనాదీప్తిని ప్రభుత్వం నియమించింది. 2012 బ్యాచ్‌కు చెందిన చందనా దీప్తి ట్రెయినీ ఐపీఎస్‌గా నల్లగొండ జిల్లాలో విధులు నిర్వహించారు.

## వామపక్షాలు బరిలో ఉంటాయి

భువనగిరిటౌన్ : ఎంపీ ఎన్నికల్లో వామపక్ష పార్టీలు పోటీలో ఉంటాయని, ఇండియా కూటమి భాగస్వామ్యంతో భువనగిరి స్థానం నుంచి పోటీ చేయడానికి సీపీఐ ఆసక్తి చూపుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియా కూటమిలో సీపీఎం, సీపీఐలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని, ఎంపీ ఎన్నికల్లో పలు రాష్ట్రాల్లో బరిలో నిలిచేందుకు సన్నద్ధం అవుతున్నట్లు పేర్కొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి న్యూ ఇయర్ శుభాకాంక్షలు



నల్లగొండ : రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలనపోయి తెలంగాణ ప్రజలకు ప్రజాపాలన వచ్చిందన్నారు. ప్రజలకు మంచి రోజులు వచ్చాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో మరిన్ని సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతామన్నారు. ప్రజలంతా నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.

**శుభాకాంక్షలు చెప్పేందుకు హైదరాబాద్ రావొద్దు**

నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు తన వద్దకు హైదరాబాద్ రావద్దని మంత్రి పేర్కొన్నారు. 'ప్రజాపాలన' కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త.. గ్రామాల్లో, వార్డుల్లో ఉండి వృద్ధులు, నిరక్షరాస్యులు, అభాగ్యులకు అండగా ఉండాలని సూచించారు. వచ్చే వారం నల్లగొండ జిల్లా పర్యటనకు వచ్చి ప్రతీ ఒక్కరిని కలుస్తానని తెలిపారు. తనకు ఇచ్చేందుకు బొకేలు, శాలువాలు కొనవద్దని.. అదే డబ్బును సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమచేయాలని కోరారు.

## నారసింహుడికి నిత్యారాధనలు


ఆలయ మాడ వీధుల్లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం ఆరాధన, నిజాభిషేకం, అర్చన తదితర పూజలు గావించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను ఊరేగించారు.

## లక్ష్యానికి మించి సేకరణ

**ముగిసిన ధాన్యం కొనుగోళ్లు**
- 2.52 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- 2.64 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- రైతులకు రూ.563 కోట్లు చెల్లింపు


ధాన్యం తూకం వేస్తున్న సిబ్బంది

భువనగిరి : జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. ఈసారి అంచనాలకు మించి కొనుగోళ్లు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా రైతులు 2,82,857 ఎకరాల్లో వరి సాగు చేశారు. 2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కొనుగోళ్లకు 315 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి 303 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**సేకరించిన వడ్లు ఇలా..**

లక్ష్యానికి మించి అధికారులు ధాన్యాన్ని సేకరించారు. 2.52లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది లక్ష్యంగా కాగా 33,416 మంది రైతుల నుంచి 2,64,486 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. లక్ష్యానికి మించి అదనంగా 12 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

**కొనుగోళ్లలో జాప్యం**

ఈసారి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగింది. వరి కోతలు అక్టోబర్‌లోనే ప్రారంభం అయ్యాయి. ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశారు. కానీ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం, వర్షాలు కురువడంతో కొంత ఆలస్యం చోటు చేసుకుంది.

| కొనుగోళ్లు ఇలా.. | |
|---|---|
| ప్రతిపాదిత కేంద్రాలు 315 | ప్రారంభించినవి 303 |
| రైతులు 33,416 | |
| లక్ష్యం 2.52 లక్షల మెట్రిక్ టన్నులు | |
| సేకరించింది 2.64 లక్షల మెట్రిక్ టన్నులు | చెల్లించవలసిన డబ్బులు రూ.581కోట్లు |
| చెల్లించింది రూ. 563 కోట్లు | |

**మిగతా రైతులకు త్వరలోనే జమచేస్తాం**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. రైతులకు బిల్లుల చెల్లింపు కూడా దాదాపు పూర్తియ్యింది. కొంద్ది మంది రైతులు చెల్లించవలసి ఉంది. త్వరలోనే వారి ఖాతాల్లో కూడా నగదు జమ చేస్తాం. కొనుగోళ్లలో జాప్యం జరిగినప్పటికీ లక్ష్యానికి మించి సేకరించాం.

– గోపికృష్ణ, సివిల్ సప్లయ్ మేనేజర్

# యాదాద్రి ఆలయ వేళల్లో మార్పు

**యాదగిరిగుట్ట:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ వేళల్లో మార్పులు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆలయాన్ని ఉదయం 3గంటలకు తీసి, 3.30గంటల వరకు సుప్రభాతం నిర్వహిస్తారు.3.30నుంచి 4గంటల వరకు ఆరాధన, 4 నుంచి 5గంటల వరకు బాలభోగం, తిరుప్పావై, 5గంటల నుంచి 6గంటల వరకు శ్రీస్వామి వారికి నిజాభిషేకం, 6 నుంచి 6.30గంటల వరకు శ్రీస్వామి వారికి సహస్రనామార్చన, 6.30 నుంచి 9గంటల వరకు ఉభయ దర్శనాలు, 9నుంచి 10 గంటల వరకు బ్రేక్ దర్శనాలు, 10 గంట నుంచి మధ్యాహ్నం 12 వరకు ఉభయ దర్శనాలు, 12 నుంచి 1 గంటల వరకు మధ్యాహ్న రాజభోగం, 1 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉభయ దర్శనాలు, 4 నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శనాలు, 5 నుంచి 7గంటల వరకు ఉభయ దర్శనాలు, రాత్రి 7గంటల నుంచి 7.30 వరకు తిరువారాధన, 7.30 నుంచి 8.15గంటల వరకు శ్రీస్వామి వారికి సహస్రనామార్చన, 8.15 నుంచి 9 గంటల వరకు ఉభయ దర్శనాలు, 9నుంచి 9.45గంటల వరకు రాత్రి నివేదన, 9.45 నుంచి 10గంటల వరకు శయనోత్సవ దర్శనం, అనంతరం ద్వార బంధనం చేస్తారు.

**వేడుకలకు పుణ్యక్షేత్రం సిద్ధం**

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి నూతన సంవత్సర శోభ సంతరించుకుంది. 2023 ఆంగ్ల సంవత్సరానికి స్వస్తి పలుకుతూ, 2024 సంవత్సరానికి యాదాద్రి ఆలయం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ఆలయానికి భక్తులు నూతన సంవత్సరం రోజున అధికంగా వస్తారనే ముందస్తు సమాచారంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆలయానికి వచ్చే భక్తులకు లడ్డూ, పుళిహోర, అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందుబాటులో ఉంచారు. ఉదయం 5గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రసాద విక్రయశాలలను తీసి ఉంచుతామని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఇక పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సైతం నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

## సూర్యక్షేత్రంలో వైభవంగా పూజలు

**అర్వపల్లి:** రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞ శాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూ డా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

## గూడూరులో న్యూ ఇయర్ రద్దీ


గూడూరు టోల్ ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

**బీబీనగర్:** మండలంలోని జాతీయ రహదారిపై న్యూఇయర్ రద్దీ నెలకొంది. రెండు రోజులు సెలవులు రావడంతో జంట నగరాల నుంచి ప్రజలు వాహనాల్లో గ్రామీణా ప్రాంతాలకు తరలివెళ్లారు. దీంతో ఆదివారం సాయంత్రం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. టోల్ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్‌ను చేపట్టారు.

## యాదాద్రి క్షేత్రంలో భక్తజన సందోహం


ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు


యాదాద్రి కొండపై భక్తుల కోలాహలం

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజుతో పాటు 2023 సంవత్సరానికి చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా శ్రీస్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, కల్యాణకట్ట, పుష్కరిణి వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. భక్తులు అధికంగా రావడంతో శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి రెండున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారి ఆలయానికి రూ.42,00,353 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## అయ్యప్పను దర్శించుకున్న ట్రాన్స్‌జెండర్

- కేరళ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన జోగిని నిషా క్రాంతి

**నార్కట్‌పల్లి :** కేరళ చరిత్రలో ఓ ట్రాన్స్ జెండర్ తొలిసారి శబరిమల అయ్యప్పను దర్శించుకున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వరస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు, ప్రతి అమావాస్యకు విచ్చేసే ట్రాన్‌జెండర్ జోగిని నిషా క్రాంతి ఆదివారం శబరిమల అయ్యప్ప ఆలయంలో స్వామివారిని దర్శించుకుంది. ట్రాన్స్ జెండర్ ఐడీ ఆధారంగా ఆమెకు కేరళ ప్రభుత్వం దర్శనానికి అనుమతిచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాన్స్ జండర్‌లు చాలా మంది అయప్ప మాల ధరించి స్వామిని దర్శించుకోవాలని అనుకుంటున్నారని చెప్పింది. తనకు దర్శనం కల్పించిన కేరళ ప్రభుత్వానికి ఆమె ధన్యవాదాలు తెలిపింది. ఇది ఒక శుభ పరిణామమని.. తాను కూడా అందరిలాగే శబరిమల కొండ ఎక్కి అయ్యప్పను దర్శించుకోవడంతో తన జన్మ ధన్యం అయిందని పేర్కొంది.


కేరళలోని అయ్యప్ప సన్నిధానంలో జోగిని నిషా క్రాంతి

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

**నాగార్జునసాగర్:** జూనియర్ 49వ అంతర్ జిల్లాల తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఆదివారం స్థానిక బీసీగురుకుల విద్యాలయంలో బాల,బాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధుల శాసనమండలి సభ్యుడు ఎం.సి.కోటిరెడ్డి కి జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు భూలోకరావు,జి.కర్తయ్యలు పరిచయం చేశారు. బాలుర విభాగంలో 18మంది,బాలికల విభాగంలో 16మంది కోచింగ్ క్యాంపునకు ఎంపికైనట్లు వారు తెలిపారు. జనవరి 11నుంచి 14వతేదీ వరకు సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ జట్లు పాల్గొననున్నాయి. క్రీడాకారులను ఎంపిక చేసిన వారిలో బి.వెంకటరత్నం,జె.కొండల్,సి.హెచ్.డోమనిక్,జె.చంద్రయ్య,టి.సత్తయ్య,ఎండి.వహీద్, వై.రాంబాబులు ఉన్నారు.

## బస్సులో దుండగుడి చేతివాటం

- ప్రయాణికుడి నుంచి రూ.40వేలు చోరీ

**మోత్కూరు :** గుర్తుతెలియని వ్యక్తి బస్సులో చేతివాటం ప్రదర్శించారు. చాకచక్యంగా ప్రయాణికుడి బ్యాగును కత్తిరించి రూ.40వేలు అపహరించుకుపోయా డు. ఈ ఘటన ఉప్పల్ నుంచి మోత్కూరుకు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సులో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన గుండు హరికిషన్ డిసెంబర్ 30న చింతలకుంట నుంచి బయలుదేరి ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద నుంచి మోత్కూరుకు రావడానికి యాదగిరిగుట్ట డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు ఎక్కాడు. మోత్కూరుకు వచ్చిన తర్వాత తన వద్ద ఉన్న బ్యాగును చూసూకోగా బ్లేడ్‌తో కట్ చేసి ఉన్నది. బ్యాగులో ఉన్న తన డబ్బులను చూసుకోగా రూ.40 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు గుర్తించి ఈ మేరకు ఆదివారం మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.


బ్లేడ్‌తో కట్ చేసిన బ్యాగును చూపిస్తున్న బాధితుడు హరికిషన్